క్లుప్తంగా

ప్రతి ఒక్కరు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలి

పులివెందుల టౌన్ : భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు దేశప్రజల ఆరోగ్యం కోసం బీసీజీ టీబీ వ్యాక్సిన్‌ను 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలు ఉన్న ప్రతి ఒక్కరు వ్యాక్సిన్ వేయించుకోవాలని బీజేపీ ఎస్సీమోర్చ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. మండల పరిధిలోని ఎర్రబల్లి దళితవాడ కాలనీలో ఆయన అంబేడ్కర్ కమిటీ భవనంలో ప్రజలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీసీజీ టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించి ప్రజలకు టీబీ జబ్బు సోకకుండా అరికడదామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం సువార్త, ఆశావర్కర్ కమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రకు తరలిరండి

సింహాద్రిపురం : పులివెందులలో శ్రీరాముడి దూత చిరంజీవుడు హనుమాన్ జన్మదినోత్సవ సందర్భంగా జూన్ 1వ తేదీ జరుగు తృతీయ హనుమాన్ శోభాయాత్రకు తరలిరావాలని హనుమాన్ హిందూ ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం సాయంత్రం 4 గంటలకు నూతన బస్టాండ్ సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి పూలఅంగళ్ల మీదుగా పాత బస్టాండు వరకు శ్రీ హనుమాన్ శోభాయాత్రను నిర్వహిస్తున్నామని, హిందూ బంధువులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మీడియా ఇన్‌చార్జి యాగంటి బాలకృష్ణారెడ్డి, హిందూ ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

పెండ్లిమర్రి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వంట ఏజెన్సీ నిర్వాహకులు నాణ్యమైన భోజనం వడ్డించాలని మండల స్పెషలాఫీసర్ జయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం మండలంలోని అన్ని పాఠశాలల వంట ఏజెన్సీ నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు మెను తప్పని సరిగా పాటించాలన్నారు. వంట చేసే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకుని వంట పాత్రలను, కూరగాయలను శుభ్రంగా కడిగి వంట చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఎంఈఓ సుజాత, వంట ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు వంట ఏజన్సీ నిర్వాహకులకు శిక్షణ

వల్లూరు : మండలంలోని మధ్యాహ్న భోజన పథకం వంట ఏజన్సీల నిర్వాహకులకు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు గంగాయపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్‌లో శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంఈవో లిల్లెమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మధ్యాహ్న భోజన పథక వంట ఏజన్సీల నిర్వాహకులు ఈ శిక్షణ కార్యక్రమానికి తప్పని సరిగా హాజరు కావాలని ఆమె తెలిపారు.

నీటిఎద్దడిపై ఫిర్యాదు



పంచాయితీ కార్యదర్శికి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళలు

చెన్నూరు : మండలంలోని రామనపల్లి బీసీ కాలనీలో నాలుగు నెలలుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గురువారం బీసీ కాలనీ మహిళలు గ్రామపంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. బీసీ కాలనీలో నాలుగు నెలలుగా తమకు తాగునీరు అందడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తెల్లవారుజామున లేచి వ్యవసాయ పనులు, కూలీపనులకు వెళ్లి సాయంత్రం ఇంటికొచ్చేసరికి ఎక్కడో గుంతలలో నిలిచిన నీరు పట్టుకోవలసి వస్తుందని మండిపడ్డారు. కాలనీలో నీరు అందకుండా పోతున్నదని, తమకు తాగునీటి వసతి కల్పించాలని కోరినప్పటికీ తమ సమస్య తీర్చలేదని మహిళలు తెలిపారు. ఈ విషయంపై గురువారం గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి కార్యదర్శి ఎదుట తమ గోడు వెలిబుచ్చుకున్నారు. బీసీ కాలనీలో తాగునీటి సమస్య వెంటనే తీర్చాలని వారు డిమాండ్ చేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన సోపానాలు



గ్రంథాలయంలో విద్యార్థులకు సైన్స్ పాత్రపై అవగాహ కల్పిస్తున్న జెవీవీ నాయకులు

ఎర్రగుంట్ల : విద్యార్థులకు గ్రంథాలయాలు విజ్ఞాన సోపానాలు అని ఎర్రగుంట్ల గ్రంథాలయ శాఖ అధికారి ఉమాదేవి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలను వేసవిలో ఇంటి వద్ద ఉంచకుండా గ్రంథాలయాలకు పంపించాలన్నారు. తర్వాత జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వి.బాలబయన్న సమాజంలో సైన్స్ పాత్రపై విద్యార్థులకు అవగాహన అందించారు.

ముగిసిన సుంకులమ్మ తిరునాల

కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువు కట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మ తిరునాల ఘనంగా ముగిసింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న సుంకులమ్మ నవమ బ్రహ్మోత్సవ మహోత్సవం గురువారం వైభవంగా ముగిసింది. ఉదయం ప్రాతఃకాల పూజలతో కార్యక్రమాలు ప్రారంభించారు. ప్రముఖ వేద పండితులు పవన్‌కుమార్ శర్మ ఆచారత్వమున అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. అనంతరం భక్తులకు చవ్వారెడ్డి రామసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగించారు. ఊరేగింపులో పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాల నడుమ యువత నృత్యాలు చేశారు. ఊరేగింపులో భజన బృందం చేసిన భజన, కోలాటం భక్తులను విశేషంగా అలరించింది.

ప్రముఖుల పూజలు

సుంకులమ్మ తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ కడప పార్లమెంటు అధ్యక్షుడు, కడప మేయర్ సురేష్‌బాబు, హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తదితరులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అలాగే మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ సీఎస్ నారాయణరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు.



పూజలందుకుంటున్న సుంకులమ్మ అమ్మవారు

పోటా పోటీగా బండలాగుడు పోటీలు

పాలపళ్ల బండ లాగుడు పోటీలను ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 14 జతల ఎద్దులు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. అనంతపురం జిల్లా పులేటుపల్లెకు చెందిన బచ్చల భాస్కర్‌రెడ్డి ఎద్దులు, వైఎస్సార్ జిల్లా రంగసాయిపల్లెకు చెందిన ఎంవీఎస్ఆర్ బుల్స్ మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు రాతి దూలాన్ని సమాన దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే వైఎస్సార్ జిల్లా దాసరిపల్లెకు చెందిన బోగాది సుదర్శన్, నంద్యాల జిల్లా కోడూరుకు చెందిన చాగంటి నాగేశ్వర్‌రెడ్డి, నంద్యాల జిల్లా గుంపూరు మానిదిన్నెకు చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్ జిల్లా సి.కొత్తపల్లెకు చెందిన మామిళ్ల సుబ్బారెడ్డి, నంద్యాల జిల్లా అప్పన పల్లికి చెందిన గురుచరణ్, గుంటూరు జిల్లా పెద్దపరిమికి చెందిన మోదుగుల రామిరెడ్డి ఎద్దులు తర్వాత స్థానాల్లో నిలిచాయి. వారికి వరుసగా రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు రూ.20వేలు, రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందజేశారు.



బండ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి



మేయర్ సురేష్ బాబును సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

రేపు హనుమజ్జయంతి ఉత్సవాలు

పులివెందుల రూరల్ : హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయాల నిర్వాహకులు ఇప్పటికే ఆలయాలను ముస్తాబుచేశారు. పులివెందుల మండల పరిధిలోని ఎర్రబల్లి సుగాలి తాండాలో వెలసిన కట్టమీద అభయ ఆంజనేయస్వామి 18వ జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

చెన్నూరు : స్థానిక బ్రాహ్మణవీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో జూన్ ఒకటో తేదీన శనివారం హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ చర్యలు చేపట్టింది. పుష్పగిరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ అభినవ ఉద్దండ విద్య శంకరభారతిస్వామి ఆశీస్సులతో ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం ఐదు గంటలకు వేద పండితులు సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించనున్నారు. భక్తులు పంచామృతాన్ని ఒక గ్లాసులో స్వయంగా తమ ఇంటి వద్దనే తయారు చేసుకుని ఆలయానికి వచ్చి ఉత్సవ విగ్రహానికి తమ స్వహస్తాలతో అభిషేకం చేసుకోవచ్చని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

వల్లూరు : మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామంలో వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో జూన్ 1వ తేదీన హనుమజ్జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల సలహాదారులు రాజోలు వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

కమ్ముకున్న కరువు ఛాయలు

- అడుగంటిన బోర్లు, బావులు
- ఎండుతున్న పండ్ల తోటలు
- కన్నీటి పర్యంత మవుతున్న రైతులు

చక్రాయపేట : వాన దేవుడు ముఖం చాటేశాడు. కనుచూపు మేరలో ఎక్కడేగాని చూద్దామంటే చుక్క నీరు లేదు. వాగులు వంకలే కాదు, బోర్లు, బావులు సైతం అడుగంటి పోయాయి. ఫలితంగా చీనీ, నిమ్మ, మామిడి తోటలు కొన్ని చోట్ల చనిపోగా మరి కొన్ని ప్రాంతాల్లో ఎండు ముఖం పట్టాయి. కంటికి రెప్పలా చంటి బిడ్డలను సాకినట్లు సాకిన చెట్లు కళ్ల ముందే చచ్చి పోతుండటంతో రైతన్నలు దిక్కు తోచక కన్నీటి పర్యంతం అవుతున్నారు. చక్రాయపేట మండలంలో చీనీ, నిమ్మ, మామిడి ప్రధాన పంటలు. వీటిపైనే రైతులు ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. అయితే 2021లో వచ్చిన వరదలు తప్ప అనంతరం మండలంలో చెప్పుకోతగ్గ స్థాయిలో వర్షాలు పడలేదు. చెరువుల్లో చుక్క నీరు లేదు. దీంతో భూమిలో నీటి శాతం పూర్తిగా తగ్గి పోయింది. ఫలితంగా బోర్లు ఎండి పోయాయి. దీంతో మామిడి నిమ్మ చీనీ తోటలు ఎండి పోయి రైతులను కుదేలు చేశాయి. గడ్డంవారిపల్లె పంచాయతీ పరిధిలోని బయమ్మగారిపల్లెకు చెందిన సుధాకర్‌రెడ్డికి చెందిన వందలాది చీనీ చెట్లు చనిపోయాయి. దీంతో తాను తీవ్రంగా నష్టపోయామన్నారు. బోర్లు ఎండీ పోవడంతో కొత్త బోర్లు వేసినా చుక్క నీరు పడలేదన్నారు. కొందరు రైతులు ట్యాంకర్లతో నీటిని తోలి బతికించు కుంటున్నారు. ట్యాంకరు నీళ్లు తోటలోకి రావాలంటే రూ.8 వందల నుంచి 12 వందలు వరకు ధర పడుతోందని రైతులు చెబుతున్నారు. ట్యాంకరు నీళ్లకు ఏడు లేదా ఎనిమిది చెట్లకు కూడా నీళ్ల పారవని వందలాది చెట్లు ఉన్న రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. రెండు మూడు రోజుల్లో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తే తప్ప పండ్ల తోటలు బతకవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరువు కోరల్లో చిక్కుకుని అలమటిస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బయమ్మగారిపల్లె వద్ద ఎండిపోయిన చీనీతోట

విద్యుత్ ఫిర్యాదులపై తక్షణం స్పందించండి

పెండ్లిమర్రి : గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై తక్షణం స్పందించి వాటిని పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రమణ తెలిపారు. మండలంలోని యర్లపాడు, నందిమండలం గ్రామాల్లో గురువారం క్షేత్ర స్థాయిలో ట్రాన్స్‌కో సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వచ్చిన ఫిర్యాదులను సాధ్యమైనంత తర్వగా పరిష్కరించాలన్నారు. పట్టణాల నుంచి మారుమూల గ్రామం వరకు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నాను. ఉద్యోగులకు కేటాయించిన ప్రదేశంలో నివాసం ఉంటూ వినియోగదారులకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో పగటి పూట వీదిలైట్లు వెలగకుండా చూసుకుంటూ విద్యుత్ వృథా కాకుండా అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ జయరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వంట ఏజెన్సీ నిర్వాహకులు నాణ్యమైన భోజనం అందించాలని మైలవరం మండల విద్యాశాఖాధికారి బత్తిని చిట్టిబాబు తెలిపారు. గురువారం మైలవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన వంట ఏజన్సీ నిర్వాహకులకు భోజనం తయారీలో వీడియో ద్వారా ఒక రోజు శిక్షణ ఇచ్చారు. వంట ఏజెన్సీ నిర్వాహకులు మెను ప్రకారం భోజనం అందించాలని ఆయన కోరారు. పాఠశాలలు తెరచిన రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు, యూనిఫాం, బ్యాగు అందించాలన్నారు.

వేసవిలో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

వేంపల్లె : వేసవి సెలవుల్లో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వేంపల్లె గ్రంథాలయ శాఖ అధికారి వనజకుమారి తెలిపారు. గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని కాంపిటీషన్ పరీక్షలకు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు టీవీలు, సెల్లులు చూడకుండా గ్రంథాలయాల్లో పఠనం చేస్తే మంచి జ్ఞానం పొందవచ్చునన్నారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని తమలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలన్నారు. వేసవి సెలవులు పూర్తి అవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు వెంకటరామిరెడ్డి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయ శాఖ అధికారి వనజకుమారి

దివ్యాంగ పిల్లల నమోదు

సింహాద్రిపురం : మండల స్థాయిలో దివ్యాంగ పిల్లల నమోదు ప్రక్రియ జరుగుతుందని, ఈ సర్వే కార్యక్రమం సమగ్రశిక్ష ఎస్పీడీ ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులురెడ్డి, శారదల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు భవితకేంద్రం ఉపాధ్యాయులు షాహీద్‌బాషా, ఇంషాద్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం జరుగుతుందన్నారు. అలాగే భవిత కేంద్రంలో బుద్ధిమాంద్యత, వినికిడిలోపం, దృష్టిలోపం, సెరిబ్రల్ పాల్సి, చలనవైకల్యం మొదలైన 21 రకాల వైకల్యాలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్పించడం జరుగుతుందన్నారు. దివ్యాంగ పిల్లలకి ప్రభుత్వం తరుపున, సమగ్రశిక్ష తరుపున అన్నిరకాల అలవెన్సులు అందిస్తారన్నారు. వారికి అవసరమైన ఉపకరణాలు అందిస్తామన్నారు. అలాగే భవిత కేంద్రంలో ప్రతి మంగళవారం ఫిజియోథెరఫి కూడా జరుగుతుందన్నారు. ఈ నమోదు కార్యక్రమం జూన్ 9వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.



దివ్యాంగ పిల్లల నమోదు ప్రక్రియను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పింఛన్ నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి

పులివెందుల టౌన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు వృద్ధాప్య, చేనేత, వితంతువు, వికలాంగుల, అభయహస్తం, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జండర్స్, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులకు మెడికల్ పింఛన్ దారులకు జూన్ మాసానికి సంబంధించి పింఛన్ డబ్బులు నేరుగా వారివారి బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన ఛాంబర్‌లో సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పులివెందులలో మొత్తం 7,350 మంది పింఛన్‌దారులు ఉండగా అందులో 4,836 మంది పింఛన్ దారులకు వారి బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరుగుతుందన్నారు. మిగిలిన 2,514 మంది పింఛన్ దారులకు సచివాలయ సిబ్బంది జూన్ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందిస్తారన్నారు. వికలాంగులు, మెడికల్ పెన్షన్, బెడ్ రిడన్ వారికి ఆధార్‌కార్డు బ్యాంకు ఖాతాకు అనుసంధానం లేనివారికి గత నెల డీబీటీ విఫలమైన వారికి, 80 సంవత్సరాలు వయస్సు పైబడిన వారికి వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ ఇస్తారన్నారు. పింఛన్‌దారులు ఎవరూ సచివాలయాల వద్దకు కానీ, ఏ ఇతర కార్యాలయాలకు వెళ్లనవసరం లేదన్నారు. పింఛన్ బ్యాంకులో జమ అయిన వారు 1వ తేదీ నుంచి ఎప్పుడైనా బ్యాంకుకు వెళ్లి పింఛన్ మొత్తం డ్రా చేసుకోవచ్చన్నారు.



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

పులివెందుల రూరల్ : పట్టణంలోని నగరిగుట్ట ప్రాథమిక వైద్యశాల పరిధి పెద్దరంగాపురం, వాసవికాలనీ, తదితర ప్రాంతాల్లో జిల్లా ఉపవైద్య ఆరోగ్య అధికారి ఖాజామొయిద్దీన్ లింగనిర్ధారణ వ్యతిరేక చట్టంపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడబిడ్డ దేశ అభివృద్ధికి తోడ్పడుతుందని, అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలన్నారు. 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలు ఉన్న ప్రతి ఒక్కరూ రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఈ వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల క్షయవ్యాధి పునరావృతం కాకుండా ఉంటుందన్నారు. రాబోవు కాలంలో క్షయభారిన పడకుండా కాపాడుకోవాలంటే తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. పులివెందుల డివిజన్ పరిధిలోని 14 ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, వాటిలో 4 ప్రభుత్వ స్కానింగ్ సెంటర్లు, 10 ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు ఉన్నాయన్నారు. ప్రతి నెల ప్రైవేట్ ఆసుపత్రిలో స్కానింగ్ సెంటర్‌ను పర్యవేక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో రమణమ్మ, స్నేహిత అమృతహస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు, ఏఎస్ఎంలు శ్రీకాంత్, ప్రశాంతి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో శుక్రవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని జేఈ రమేష్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కౌమారదశపై అవగాహన ఉండాలి

వేంపల్లె : రుతుక్రమం అనేది మహిళ శరీరంలో జరిగే సహజ ప్రక్రియ అని దీనిపై కౌమార దశ బాలికలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న సూచించారు. వేంపల్లె మండలం నందిపల్లె గ్రామంలో మహిళలకు, బాలికలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుతుక్రమం పట్ల ఉన్న మూడనమ్మకాలను, అపోహలను వీడనాడాలన్నారు. అవగాహన లేకపోవడంతో చాలామంది నిరుపేద పిల్లలు చదువుకు దూరం అవుతున్నారన్నారు. బుతుస్రావం సమయంలో మహిళలు పరిశుభ్రతను పాటించాలని అలాగే రుతుక్రమం గురించి పలు జాగ్రత్తలను గురించి మహిళలకు వివరించారు. అదేవిధంగా ఆడపిల్లల ప్రాముఖ్యత, లింగహింస, లింగ నిష్పత్తిని గురించి కూడా వారికి తెలియజేశారు. అనంతరం గ్రామంలో బాలికలు, మహిళలతో కలిసి అవగాహన ర్యాలీని నిర్వహించారు.అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరత్న, ఏఎస్ఎం నాగస్వర్ణ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కౌంటింగ్ రోజున షాపులు తెరవకూడదు

కమలాపురం : సాధారణ ఎన్నికల ఫలితాల కౌంటింగ్ జరిగే జూన్ 4వ తేదీన మండలంలోని అన్ని షాపులు మూసివేయాలని ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దుకాణాదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ నాడు 144 సెక్షన్ అమలులో ఉండటం కారణంగా 3వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 5వ తేదీ ఉదయం 6 గంటల వరకు మండలంలోని అన్ని షాపులు మూసివేయాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఇప్పటి నుంచి కూడా ఏ షాపు వద్ద కూడా నలుగురికి మించి ఉండకూడదన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

డీఎస్పీ వినోద్‌కుమార్

వేంపల్లె : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకుని సమాజంలో విలువలు పెంపొందించుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే తాట తీస్తామని హెచ్చరించారు. నేరస్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు ఉంచామని, అలాగే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ర్యాలీలు, రాస్తారోకోలు, విజయోత్సవాలు, బాణాసంచా కాల్చడం, సంబరాలు చేసుకోవడం నిషేధించడమైందన్నారు. ముఖ్యంగా బెట్టింగులకు పాల్పడకుండా దూరంగా ఉండాలని సూచించారు. అలాగే ఓట్ల లెక్కింపు రోజు ప్రజలు ఎవరూ రోడ్లమీద గుంపులుగా ఉండరాదని, అల్లర్లకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ చాంద్‌బాషా, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ వినోద్‌కుమార్

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

వేముల : జూన్ 4వ తేదీన అసెంబ్లీ, పార్లమెంట్ ఫలితాల కౌంటింగ్ సందర్భంగా వేముల మండలంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరైనా పోలీసు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ ధనుంజయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో కర్ఫ్యూ వాతావరణం ఉన్నందున జూన్ 4వ తేదీన హోటళ్లు, దుకాణాలు, ఇతర వాణిజ్య వ్యాపారాలు మూసివేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు వీధులలో తిరగరాదని, వైద్య అవసరాల నిమిత్తం తప్ప వేముల గ్రామంలోకి బయట వ్యక్తులు, ఇతరులకు అనుమతి లేదన్నారు. పోలీసు వారి అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, బాణాసంచా కాల్చడం చేయరాదన్నారు. ప్రజలు పై నిబంధనలు పాటించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

కౌంటింగ్ రోజు పోలీసు నిబంధనలు పాటించాలి

పులివెందుల : పట్టణంలో కౌంటింగ్ రోజున ప్రజలు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలీసు నిబంధనలు పాటించాలని అర్బన్ సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ 4వ తేదీన కౌంటింగ్ రోజు పట్టణంలో 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున కర్ఫ్యూ తరహా వాతావరణం ఉంటుందన్నారు. ప్రజలు అనవసరంగా వీధులలో తిరుగరాదన్నారు. అలాగే కౌంటింగ్ రోజున పట్టణం, గ్రామాల్లో అన్ని దుకాణాలు, హోటళ్లు మూసివేయాలన్నారు. పట్టణంలో అత్యవసర పరిస్థితుల్లో తప్పా ఇతరులకు ప్రవేశం లేదన్నారు. పట్టణంలో ఉన్న అన్ని లాడ్జీల యజమానులు, ఫంక్షన్ హాల్ యజమానులు వచ్చే నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఎట్టిపరిస్థితుల్లో పోలీసు వారి అనుమతులు లేకుండా గదులు అద్దెకు ఇవ్వకూడదన్నారు. బాణాసంచాలు పోలీసు వారి అనుమతి లేకుండా కాల్చరాదన్నారు. విజయోత్సవ సభలకు, ర్యాలీలకు, ఊరేగింపులకు ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతి లేదన్నారు. అన్ని పార్టీల కార్యాలయాల వద్ద తగిన బందోబస్తు ఉంటుందన్నారు. ఆయా పార్టీల కార్యకర్తలను నియంత్రించుకోవాల్సిన బాధ్యత పార్టీ నాయకులదేనన్నారు. ఈ నిబంధనలు పాటించకుండా ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శాంతి భద్రతల విషయంలో అందరు పోలీసు వారికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



పులివెందుల అర్బన్ సీఐ శంకర్‌రెడ్డి